క్లుప్తంగా

ఖేడ్ బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



సన్మానం పొందిన ఖేడ్ బార్ అసోసియేషన్ బాధ్యులు

నారాయణఖేడ్: తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు నారాయణఖేడ్ జూనియర్ సివిల్ కోర్టుకు సంబంధించిన బార్ అసోసియేషన్ ఎన్నికలను గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా నర్సారెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పోతుల సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్‌రావు, సహాయ కార్యదర్శిగా అలిగే జీవన్ కుమార్, కోశాధికారిగా నర్సింహారావు, కార్యవర్గ సభ్యులుగా ఆనంద్ స్వరూప్‌షెట్కార్, మారుతిరెడ్డి, భోజిరెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా చంద్రశేఖర్‌రావు వ్యవహరించారు. అనంతరం ఎన్నికైనవారిని న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.

అద్దె చెల్లించని దుకాణాలు సీజ్

జోగిపేట(అందోల్): అందోల్–జోగిపేట మున్సిపాలిటీ దుకాణ సముదాయంలో అద్దె చెల్లించని నాలుగు దుకాణాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ గాంధీపార్క్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని మున్సిపల్ సముదాయంలో దుకాణాలకు పలుమార్లు నోటీసు ఇచ్చినప్పటికీ అద్దె చెల్లించనందునా 2019 పురపాలక చట్టం, రెవెన్యూ రికవరీ ఆక్ట్ ప్రకారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నారాయణ ఆధ్వర్యంలో దుకాణాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం మాఫీ ఉందన్నారు. నీటి బిల్లు, వృత్తి వ్యాపార లైసెన్సుల రుసుం చెల్లించి పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

జహీరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ఆ పార్టీ నాయకులు జహీరాబాద్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అరుణ కౌళాస్, అర్చన సారడా, విశ్వనాథ్, శ్రీనివాస్‌గుప్తా, సంతోష్, సందీప్, శోభారాణి, అప్పం శ్రవణ్, శ్రీధర్, వెంకట్, రుషబ్, వంశీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణం మహిళ అదృశ్యమైన ఘటన గురువారం సంగారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన కొండి సంతోష మంగళవారం సాయంత్రం ఇంట్లో గొడవపడి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త కిషన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 8712656718 ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

క్షయ నిర్మూలనపై అవగాహన

సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో భాగ్య క్లబ్ బయోటెక్నాలజీ, ఎన్ఎస్ఎస్ యూనిట్, క్షయ నిర్మూలన విభాగం ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన సదస్సు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ బహుమతులను ప్రదానం చేశారు.

ఘనంగా దుర్గాభవానీ విగ్రహ ప్రతిష్ఠాపన

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని షేర్‌ఖాన్ పల్లి గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన దుర్గభవానీ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ బోర్‌వెల్ కూలి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఉంగా, అతడి బావమరిది మేదియామి భీమా కలిసి 3 నెలల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి సాగర్ రోడ్డు వద్ద ఉంటూ బోర్‌వెల్‌లో పని చేస్తున్నారు. ఈ క్రమంలో సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్క్ సమీపంలో గురువారం తెల్లవారుజామున బోర్ వేస్తున్న క్రమంలో బోర్‌కు సంబంధించిన రాడ్ భీమాపై పడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. బోర్‌వెల్ యజమాని శ్రీధర్‌రెడ్డి, సూపర్‌వైజర్, సంజీవరెడ్డి నిర్లక్ష్యం కారణంగానే తన బామ్మర్ది చనిపోయాడని మృతుడి బావ ఉంగా ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మితిమీరిన వేగానికి చెక్..



రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన వేగ నియంత్రణ బోర్డు

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- వేగాన్ని నియంత్రించేందుకు బారికేడ్స్, స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు
- వాహనాల తనిఖీలు ముమ్మరం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసు శాఖ ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. గతంలో శేరిలింగంపల్లి గోపన్‌పల్లి నుంచి తెల్లాపూర్ మీదుగా కొల్లూర్ రింగ్ రోడ్డు వరకు, శేరిలింగంపల్లి నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ ఇందిరానగర్ మీదగా మైహోం మీదుగా కొల్లూర్ రింగ్‌రోడ్డు వరకు రేడియల్ రోడ్లను అభివృద్ధి చేశారు. రోడ్డు విశాలంగా ఉండటంతో వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నారు. దీంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటునే ఉన్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ పోలీసుశాఖ వాహన వేగ నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేసింది.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు

ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసు అధికారులు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. లేబర్ క్యాంప్‌లలో సైతం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వాహనాలు నడిపేవాళ్లు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవడంతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తున్నారు.

ప్రమాద స్థలాల గుర్తింపు

రేడియల్ రోడ్లపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఇందిరానగర్ సర్కిల్ వద్ద బారికేడ్స్‌తో పాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా రోడ్లపై విద్యుత్ దీపాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేశారు.

స్పీడ్‌గన్ సహాయంతో చలాన్లు

ప్రమాదాలకు కారణం మితిమీరిన వేగమేనని గుర్తించిన అధికారులు అతివేగానికి బ్రేక్ వేయడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా రోడ్డుపై ఎంత వేగంగా వెళ్లాలని సూచించే హెచ్చరిక బోర్డులను రోడ్డు పక్కల ఏర్పాటు చేశారు. సూచించిన వేగం కన్నా ఎక్కువ వేగంతో వెళ్లే వాహనాలకు స్పీడ్‌గన్ సహాయంతో గుర్తించి చలాన్లను విధిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధలు పాటించాలి. నిబంధనలను పాటించని వారికి చలాన్లు విధిస్తున్నాం. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వాహనాదారులు ఎంత వేగంగా వెళ్లాలో సూచించే బోర్డులను ఏర్పాటు చేశాం. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలి.

– పవన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, రామచంద్రాపురం

విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయాలి



రాత్రి సమయంలో రోడ్లపై విద్యుత్‌దీపాలు లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పోలీసుశాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలి.

– సురేష్, తెల్లాపూర్

కనీస వేతనాలను అమలు చేయాలి

- సీఐటీయూ నాయకుల విజ్ఞప్తి
- ఎమ్మెల్యే మాణిక్‌రావుకు వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే మాణిక్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వం కొత్తగా జారీచేసిన జీవోను సవరించి కనీస వేతనాలను అమలుచేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు గురువారం ఎమ్మెల్యే మాణిక్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ మహిపాల్ మాట్లాడుతూ పరిశ్రమల్లో సుమారు 1.20 కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కార్మికుల కోసం ప్రభుత్వం 73 రకాల జీవోలను ఇచ్చిందన్నారు. గతంలోని జీవోలను సవరించి కనీస వేతనాన్ని తక్కువగా నిర్ణయించిందని తెలిపారు. 15 సంవత్సరాల తరువాత జీవోలను సవరించినా వేతనంలో ఎలాంటి మార్పు రాలేదని వాపోయారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించకుండా ప్రభుత్వం తగ్గించి రూ.11.325 నిర్ణయించడం అన్యాయమన్నారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో మహీంద్ర అండ్ మహీంద్ర యూనియన్ కార్యదర్శి రాజిరెడ్డి, నాయకులు రాజు, బాల్‌రాజ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీకి సొంత భవనం నిర్మించాలి

జహీరాబాద్ టౌన్: పట్టణంలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఈఎస్ఐ డిస్పెన్సరీకి సొంత భవనం నిర్మించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ అన్నారు. డిస్పెన్సరీ పట్ల అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఉండగా కార్మికులు అధికసంఖ్యలో పనిచేస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం ఈ ప్రాంతం నుంచి సుమారు రూ.25లక్షల వరకు ఈఎస్ఐ బోర్డుకు నిధులు వెళ్తున్నా కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదన్నారు. పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రి అద్దె భవనంలో కొనసాగుతుండగా అద్దె రెంట్ కూడా చెల్లించకపోవడం విచారకరమన్నారు. రెంట్ చెల్లించనందునా డిస్పెన్సరీకి ఇంటి యజమాని తాళం వేయడం శోచనీయమని తెలిపారు. సొంత భవనం లేనందునా ఈ పరిస్థితి వచ్చిందని వాపోయారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి 50 పడకల సొంత భవనం నిర్మించి రెగ్యులర్ డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలరాజ్, కృష్ణరెడ్డి, సూరినారాయణ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



నారాయణఖేడ్: సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు



కోహీర్: డాక్టర్ అఖిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: ప్రాంతీయ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షులు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులతో కలిసి ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రి ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటలక్ష్మికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనంగా రూ.26వేలు చెల్లిస్తూ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, పవన్, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికసంఘ కార్యవర్గం

సీఐటీయూ అనుబంధ ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రి కాంట్రాక్టు కార్మికుల సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అతిమెల మాణిక్, అధ్యక్షుడిగా సతీష్, ఉపాధ్యక్షులుగా అడివమ్మ, బాలమణి, ప్రధాన కార్యదర్శిగా రేవతి, సహాయ కార్యదర్శులుగా లక్ష్మి, విక్టోరియా, కార్యవర్గ సభ్యులుగా అర్జున్, బాలన్న, కవిత, ఎలిషా, లక్ష్మి ఎన్నికయ్యారు.

వేతనాలు అందించండి

కోహీర్(జహీరాబాద్): కోహీర్ ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు అందించాలని కోరుతూ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) సంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ అఖిల్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కోహీర్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 4 నెలలుగా వేతనాలు చెల్లించడంలేదన్నారు. దీంతో కార్మికులకు పూట గడవడం కష్టంగా మారిందని వాపోయారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వేతనాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు దుర్గయ్య, లక్ష్మి, వినోద, ఈశ్వరమ్మ, సుమలత, పుష్పలత, మానయ్య, పూలమ్మ,శారత, తుల్జమ్మ, రచిత తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లిని కలిసిన నీలం మధు



మైనంపల్లి హనుమంతరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపికైన నీలం మధు ముదిరాజ్ ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావును గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా తన ఎంపికలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించండి



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి

జోగిపేట(అందోల్): ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి అన్నారు. జోగిపేటలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు వార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్యం కోసం వచ్చే వారిని ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్లోకా స్కూల్ అడ్మిషన్లు నిలిపివేయాలి

సంగారెడ్డి అర్బన్: బిల్డింగ్ పూర్తి కాకముందే పర్మిషన్ లేకుండానే సీబీఎస్ పేరుతో అడ్మిషన్ తీసుకుంటున్న శ్లోకా ద హైస్కూల్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం డీఈఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ బిల్డింగ్ పూర్తి చేయకుండా.. పర్మిషన్ లేకుండా అడ్మిషన్లు ఓపెన్ అని బోర్డు పెట్టి అడ్మిషన్లు తీసుకుంటున్నారని మండిపడ్డారు. వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించి స్కూల్ యజమాన్యంపై చర్యలు తీసుకొని అడ్మిషన్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవికిరణ్, అనిల్, ఉన్నారు.

నగదు అప్పగింత



నగదు అందజేస్తున్న నరేందర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ వ్యక్తి ఏటీఎంలో సెంటర్‌లో మరిచిపోయి వదిలేసిన నగదును కొల్లూర్ పోలీసులు గురువారం బాధితుడికి అందజేశారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్‌లో నివాసం ఉండే శ్రీనివాస్ రెడ్డి తెల్లాపూర్‌లోని ఏలియన్స్ స్పేస్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి కంపెనీకు చెందిన రూ.10లక్షల నగదును తీసుకొని డిపాజిట్ చేసేందుకు తెల్లాపూర్‌లోని ఓ ఏటీఎం సెంటర్ వద్దకు వెళ్లాడు. రూ.8లక్షలను మిషిన్‌లో డిపాజిట్ చేసి మిగిలిన రూ.2లక్షలను ఏటీఎం మిషిన్‌పై పెట్టి మరిచిపోయి వెళ్ళాడు. ఈ సమయంలో డబ్బులు డ్రా చేసుకోవడం కోసం ఉస్మాన్‌నగర్ చెందిన నరేందర్ ఆ ఏటీఎం సెంటర్ వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో ఏటీఎంపై ఉన్న నగదును చూసి వెంటనే కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌కు సమాచారం అందించాడు. డబ్బు మరిచిపోయిన శ్రీనివాస్‌రెడ్డి సైతం పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ఇన్‌స్పెక్టర్ సంబంధిత నగదును గురువారం శ్రీనివాస్‌రెడ్డికి అప్పజెప్పారు. ఈ సందర్భంగా నరేందర్‌ను పోలీసులు అభినందించారు.

శివాజీ విగ్రహం ఆవిష్కరణ

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని పీపడ్‌పల్లి గ్రామంలో గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బర్దీపూర్ ఆశ్రమ సిద్దేశ్వరస్వామి, దుద్యాల మహరాజ్, నేమతాబాద్, బీదర్ కెటా ఆశ్రమాలకు చెందిన విశ్వానంద గిరిమహారాజ్, అమతయ్య మహారాజ్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ శివాజీ ఆదర్శాలను ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే తండాల అభివృద్ధి

నారాయణఖేడ్: గిరిజనుల సంక్షేమం, తండాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆపార్టీ ఎస్టీ మోర్చా జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి అమర్సింగ్ పవార్ తెలిపారు. ఖేడ్‌లో గురువారం ఎస్టీమోర్చా సన్నాహక సమావేశం, తండా దర్శన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీని మూడోసారి ప్రధానమంత్రిగా గెలిపించాలన్నారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బిబి పాటిల్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంతోష్ రాథోడ్, బీజేపీ ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, మండలాల ఎస్టీ మోర్చా అధ్యక్షులు పవన్‌నాయక్, సురేష్‌నాయక్, శివాజీనాయక్, లక్ష్మణ్‌నాయక్, సుభాష్‌నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని నాగ్వార్ గ్రామానికి చెందిన రవిందర్, పవన్, లక్ష్మయ్య తదితరులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ అంజయ్య, నాయకులు జ్ఞానేశ్వర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షికోత్సవాలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండల పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలోని మహాద్భుత ఆధ్యాత్మిక క్రతువుకు వేదిక కానుంది. లోక కల్యాణార్థం 150 మంది రుత్వికులు, 15 యజ్ఞ గుండాలచే లక్షా అరవై వేల కమలాలతో మహా యాగాన్ని నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. దుర్గా భవానీ మహాక్షేత్ర 23వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 29వ తేదీ శుక్రవారం నుంచి 31వ తేదీ ఆదివారం వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మాధికారి పేర్కొన్నారు.

కారు చోరీ

వ్యక్తికి రిమాండ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని రాయసముద్రం చెరువు కట్టపై పట్టణానికి చెందిన చిగురు శ్రీను కారును గుర్తుతెలియని వ్యక్తి కారుతో ఉడాయించిన సంఘటన తెలిసిందే. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 17వ తేదీ రాత్రి రామచంద్రాపురం పట్టణానికి చెందిన చిగురు శ్రీను తన కారుపై పట్టణంలోని రాయసముద్రం చెరువు కట్ట వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి చిగురు శ్రీనును మాటల్లో పెట్టి అతని కారుతో పరారయ్యాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు చోరీకి గురైన కారు రామన్నపేట్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్నట్లు గుర్తించి ఈ నెల 25న స్వాధీనం చేసుకున్నారు. సీసీ పుటేజీల ద్వారా కారును చోరీ చేసింది భారతినగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీకి చెందిన శ్రీనివాస్‌గా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అనంతరం శ్రీనువాస్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

సంగారెడ్డి టౌన్: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎనిమిదోసారి విష్ణువర్ధన్‌రెడ్డిని అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సూరారెడ్డి, జనరల్ సెక్రెటరీగా అంబ్రిష్, జాయింట్ సెక్రటరీగా రమేష్, ట్రెజరర్‌గా మాధవి, లైబ్రరీ సెక్రటరీగా ఆంజనేయులు, లేడీ రిప్రజెంటిటివ్‌గా లలిత, 30 ఇయర్స్ స్టాండింగ్ ఈసీ మెంబర్‌గా వీరమహేందర్, 15 ఇయర్స్ స్టాండింగ్ ఈసీ మెంబర్‌గా గైనోబో, కాజా నిజాముద్దీన్, 10 ఇయర్స్ స్టాండింగ్ ఈసీ మెంబర్స్‌గా పెంటయ్య, రమాదేవి, 5 ఇయర్స్ స్టాండింగ్ కమిటీ ఈసీ మెంబర్లుగా విజయకుమార్, వినోద్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు

నాణ్యతలో మేటి భారతి సిమెంట్

సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్



ప్రమాదబీమా పత్రాలను అందజేస్తున్న ప్రతినిధులు

జోగిపేట (అందోల్): సిమెంటు తయారీ రంగంలో భారతి సిమెంట్ విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందని ఆ సంస్థ సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్ అన్నారు. స్థానిక షిరిడిసాయి బాబా ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలతో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్లో అందుబాటులో ఉన్న ఇతర సిమెంట్లతో పోల్చుకుంటే భారతి సిమెంట్ మూడు రెట్లు మెరుగ్గా పని చేస్తుందని తెలిపారు. రోబోటిక్ క్వాలిటీ, జర్మనీ టెక్నాలజీ, టాంపర్ ప్రూఫ్ ప్యాకింగ్ వంటి అత్యున్నత ప్రమాణాలతో భారతి సిమెంట్‌ను అందజేస్తున్నామని వివరించారు. అనంతరం తాపీమేస్త్రీలకు రూ.లక్ష చొప్పున ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. సమావేశంలో ఏరియా అసిస్టెంట్ మేనేజర్ గంగాధర్‌రెడ్డి, మార్కెటింగ్ డీలర్ నర్సింహులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

కంది(సంగారెడ్డి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ పిలుపునిచ్చారు. కంది మండల కేంద్రంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి ఆ స్థానంలో మనుధర్మశాస్త్రాన్ని అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. ఇప్పటికే సీఏఏ పౌరసత్వం చట్టం అమలుకు పూనుకుని విద్యను కాషాయికరణ చేసేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నర్సింహులు, మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు భరత్ పాల్గొన్నారు.

సింధుకు అభినందన



ప్రశంసా పత్రం అందజేస్తున్న ఓయూ వైస్ చాన్సలర్ రవీందర్

సంగారెడ్డి అర్బన్: తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంగారెడ్డికి చెందిన బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న సింధుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ రవిందర్ అభినందనలు తెలిపారు. బోనాలు, బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి సింధు గుర్తింపు తీసుకువచ్చిందని తార కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హర్యానాలోని ఫరహాబాద్‌లో ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి పోటీల్లో సింధు పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.